క్లుప్తంగా

పైడిమాంబ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శ నగర్ దరి డెయిరీ ఫారం వద్ద కొలువైన పైడిమాంబ అమ్మ వారి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 వరకు కొన సాగే వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ అమ్మ వారికి విశేష పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 11న జాతర ఉత్సవం, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కృష్ణా కళాశాలలో నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని హెటిరో డ్రగ్స్, యోకోహామా టైర్స్ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. హెటిరో డ్రగ్స్ కంపెనీలో పురుషులకు మాత్రమే అవకాశముందని, కెమిస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ గల బీఎస్సీ, ఎమ్మెస్సీ విద్యార్థులు అర్హులని చెప్పారు. యోకోహామా టైర్స్ కంపెనీలో ఆపరేటర్స్ నియామకాల కోసం మహిళలకు మాత్రమే అవకాశం ఉందన్నారు.

క్రీడాకారులకు అభినందన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంజుల

విశాఖ విద్య: యునైటెడ్ ఏయూ సెట్లర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన షెటిల్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులను ఏయూ డిప్యూటీ రిజిస్ట్రార్ మంజుల అభినందించారు. ఏయూ ఇండోర్ స్టేడియంలో సోమవారం షెటిల్ పోటీలు జరిగాయి. 40 మంది క్రీడాకారులను ఆరు పూల్స్‌గా విభజించి, పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆమె బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

'పెదవాల్తేరు గ్రామ కమిటీ ఎన్నిక చెల్లదు'

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక బైలా ప్రకారం జరగలేదని, ఇది చెల్లదని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ విశాఖ అడ్వైజర్ సిహెచ్.వి.వి.సీతారామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారి, సభ్యులు ఏకపక్ష నిర్ణయంతో ఎన్నికలు జరిపారని, గ్రామ ప్రజలకు వ్యతిరేకంగా జరిగాయని తెలిపారు. ఇదే విషయమై ఎన్నికల అధికారిని ప్రశ్నించినప్పటికీ ఎటువంటి సమాధానం లేదన్నారు. పైగా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కూడా నిర్వహించిందని పేర్కొన్నారు. దీనిని మానవ హక్కుల ఉల్లంఘన కింద పరిగణించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 16 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 16 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.పద్మావతి తెలిపారు. కళాశాల పరీక్ష కేంద్రంలో జనరల్ విద్యార్థులు 248 మంది హాజరు కావాల్సి ఉండగా.. 8 మంది రాలేదన్నారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 291 మందికిగాను 8 మంది గైర్హాజరు కాగా.. 283 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. కేంద్రంలో 539 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 523 మంది హాజరు, 16 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

లైంగిక దాడుల నియంత్రణ సామాజిక బాధ్యత

సీతంపేట: పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యతే కాకుండా మనందరి సామాజిక బాధ్యతని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పిల్లలపై లైంగిక దాడులు ఏవిధంగా నివారించాలి అనే అంశంపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి రక్షణ కల్పించాలన్నారు. సైకాలజిస్ట్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు ఏది మంచి, ఏది చెడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేయాలని సూచించారు.

కళతప్పిన వేదికలు

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో నిరుపయోగంగా కళావేదికలు

- అధికారుల నిర్లక్ష్యంతో అరకొరగా కార్యక్రమాలు
- ఆహ్లాదకర వాతావరణంలో వసతులు శూన్యం
- ప్రచారం లేక ఆదరణ కరవు
- శిథిలమవుతున్నా పట్టించుకోని వైనం



శిథిలమైన కళావేదిక మెట్లు

నిర్వహణ లేక శిథిల స్థితికి..

ప్రస్తుతం ఇక్కడున్న కళావేదికలు శిథిల స్థితికి చేరుకుంటున్నాయి. వీటి నిర్వహణ పూర్తిగా విస్మరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. కళావేదికలపైన ఉండే సిమెంట్ ఊడిపోయి పెచ్చులు కనిపిస్తున్నాయి. మెట్లపైన వేసిన టైల్స్ కూడా విరిగిపోయి, శిథిలమయ్యాయి. వీటికి కొద్దిగా మరమ్మతులు చేసి పునర్వినియోగం లోనికి తీసుకొస్తే ఎంతో అనువుగా ఉంటుంది. వేదికల ఎదురుగా ఉన్న విశాలమైన ఆకుపచ్చని మైదానం వందలాది మంది కూర్చోడానికి, కార్యక్రమాలను తిలకించడానికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.



కళావేదిక ఎదురుగా సువిశాల మైదానం



వీఎంఆర్‌డీఏ పార్క్‌లో శిథిలమైన కళావేదిక

ఏయూక్యాంపస్: ఎంతో వ్యయంతో నిర్మించిన కళావేదికలు నిరుపయోగంగా మారిపోయాయి. లక్షలు రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు శిథిలమవుతున్నాయి. వీఎంఆర్‌డీఏ(వుడా) పార్క్‌లో గతంలో నిర్మించిన పలు కళావేదికలు నేడు నిర్లక్ష్యం కారణంగా కళావిహీనంగా తయారయ్యాయి. దీంతో స్థానికులు, సందర్శకులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు వేదికలు.. సుందర ప్రాంగణం

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో సముద్ర తీరానికి చేరువలో మూడు ఆరుబయలు రంగస్థల వేదికలను గతంలో ఏర్పాటు చేశారు. విశాలమైన ప్రాంగణంలో చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయుక్తంగా వీటిని నిర్మించారు. ప్రస్తుతం వీటిపై అరకొరగా మాత్రమే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారాంతంలో కుటుంబాలు, స్నేహితులతో కలిసి నిర్వహించే వేడుకలకు, కార్తీక మాసంలో ప్రత్యేక కార్యక్రమాలకు, పిక్నిక్‌ల నిర్వహణకు, సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ వేదికలు ఎంతో అనువుగా నిలుస్తాయి. సాయంత్రం వేళల్లో జరిగే వేడుకలకు కేవలం కుర్చీలు వంటివి తీసుకొస్తే సరి పోతుంది. కార్యక్రమానికి అనుగుణంగా వేదికను అలంకరించుకోవాల్సి ఉంటుంది.



స్కేటింగ్ రింగ్ వద్ద వేదిక

వసతులు, ప్రచారం కల్పించాలి

"వీఎంఆర్‌డీఏ పార్కులోని పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకల నిర్వహణకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయి. దీనికి అనుగుణంగా కొద్దిపాటి వసతులు, ప్రచారం కల్పిస్తే ఎక్కువ మంది ఇక్కడి కళావేదికలను వినియోగించుకునే అవకాశముంది."

– వి.ఎస్.రావు, లాసన్స్ బే కాలనీ

ప్రచారం శూన్యం..

పక్కనే విశాలమైన సాగర తీరం. ఆహ్లాదకరమైన వాతావరణం. చుట్టూ ఆకుపచ్చని మొక్కలు, వృక్షాలు. వేదిక చుట్టూ ఆకుపచ్చని మైదానాలు ఉన్నాయి. ఇటువంటి ఆహ్లాదకరమైన వసతులు ఉన్నప్పటికీ కళావేదికలపై బయట వారికి తగినంత ప్రచారం లేదు. దీంతో ఇక్కడ కళావేదికలు ఉన్నాయని, వీటిపై కార్యక్రమాలు నిర్వహించవచ్చుననే కనీస అవగాహన సైతం కొరవడింది. దీంతో ఏడాదికి ఒకటి, రెండు కార్యక్రమాలు మాత్రమే ఇక్కడ జరుగుతున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వీటిపై కొంత ప్రచారం పెంచి, అనుమతులు మంజూరు సరళతరం చేస్తే తరచూ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలు మెరుగవుతాయి. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలి.

ఏయూలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్య సంబంధిత క్రమశిక్షణను పెంపొందించడానికి అత్యధిక ప్రాధాన్యమిస్తామని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఇంజినీరింగ్, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సోమవారం ఉదయం ఆయన సమావేశమయ్యారు. మధ్యాహ్నం ఫార్మసీ, న్యాయ, ఆర్ట్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగంలో వసతుల కల్పన తదితర అంశాలకు సంబంధించిన వివరాలు, వినతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విభాగాల్లో తరగతులు పటిష్టంగా నిర్వహించాలని, విద్యార్థులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థులందరూ నియమావళిని అనుసరించేలా ఆచార్యులు, విభాగాధిపతి చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం తరగతులకు వస్తేనే వారి నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని, భవిష్యత్తులో ఉన్నత, ఉపాధి అవకాశాలను పొందడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని, ప్రతి విభాగంలోని సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగుపరచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం చేస్తామన్నారు. త్వరలో జరగనున్న శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు జి.శశిభూషణరావు, జి.గిరిజా శంకర్, ఎం.వి.ఆర్.రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఏయూ వీసీ రాజశేఖర్‌కు పుస్తకం బహూకరిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌ను సోమవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు, అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీకి వారు పుస్తకం, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు డాక్టర్ డి.శ్రావణ్‌కుమార్, డాక్టర్ కె.రవిబాబు, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ పి.గోపాల్‌నాయుడు, డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే మానవ జీవితానికి సార్థకత



శంకరశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేస్తున్న స్వామి పరిపూర్ణానంద

మద్దిలపాలెం: సాధనతోనే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని స్వామి పరిపూర్ణానంద ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆఖరి రోజు సోమవారం స్వామి ప్రవచనాలు శ్రావ్యానందకరంగా సాగాయి. ఈ సందర్భంగా కళాభారతి వ్యవస్థాపక దినోత్సవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వర్ధమాన కళాకారులకు స్వామీజీ, కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, రూ. 2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేసి, జ్ఞాపికలతో సత్కరించారు. గాత్ర విభాగంలో ఎస్.విష్ణు ప్రియ ఇందిరా(విశాఖపట్నం), ప్రీతి రాజు, శ్రీరవళి మనోహరం కూచిపూడి నృత్యంలో అవార్డులు స్వీకరించారు. నాదస్వరంలో విజయనగరానికి చెందిన బర్లి గణేష్, శ్రీకాకుళానికి చెందిన కుప్పలి గణేష్‌కు అందించారు. డోలు విభాగంలో సాన్నాయిని దేవరాజు పురస్కారం అందుకున్నారు.

ఈ సందర్భంగా కళాభారతి వ్యవస్థాపకుడు శంకరశాస్త్రి చిత్రపటానికి పరిపూర్ణానంద స్వామి పూలమాల సమర్పించి మాట్లాడారు. వ్యవస్థాపకుల ఆశయాలకు అనుగుణంగా కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రాంబాబు ఎన్నో సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. సూర్యభగవానుడు ఎలాగైతే ప్రతి రోజూ ఉదయిస్తాడో.. ప్రతి మనిషి నిత్యం సాధన చేయాల్సిన అవసరముందని ముగింపు కార్యక్రమంలో ప్రవచించారు.

ఏప్రిల్‌లో జాతీయ సదస్సు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా ఏప్రిల్ 3,4 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 'ఆర్థిక సమ్మిళిత-సామాజిక సమానత్వం : 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ఒక రోడ్ మ్యాప్' అనే అంశంపై సదస్సు జరగనుంది. సదస్సు నిర్వాహకులను ఈ సందర్భంగా వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, సదస్సు సహ కన్వీనర్ డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యపై అవగాహన

బీచ్‌రోడ్డు: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్టీ ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ ప్రారంభించి ప్రసంగించారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులతోపాటు ఇప్పటికే శస్త్రచికిత్స ద్వారా వినికిడి సమస్యను పరిష్కరించుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కార్పొరేట్ విద్యా సంస్థలకు లబ్ధి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార: విద్యా రంగంలోని కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చుతూ విద్యార్థుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసేలా రూపొందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పీడీఎస్‌వో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధికి విద్య చాలా కీలకమని, ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా గుర్తింపు పొందాలంటే విద్య చాలా ముఖ్యమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025 – 26 బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.1.28 లక్షల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఉన్నత విద్యకు గత ఏడాది కంటే 4.4 శాతం మాత్రమే పెంచారని తెలిపారు. మేకిన్ ఇండియా అని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు ప్రాధాన్యమిచ్చి, కొత్త ఆవిష్కరణల వైపు విద్యార్థులను ప్రోత్సహించకుండా యూనివర్సిటీల ప్రమాణాలను గంగలో కలుపుతోందని ఆరోపించారు. కార్పొరేటీకరణకు ఊతమిస్తూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కేంద్ర బడ్జెట్ మోసపూరితమైందని మండిపడ్డారు. పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాఠశాల విద్యకు కేవలం రూ.31,805 కోట్లు మాత్రమే కేటాయించారని... ఈ మొత్తం ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులకు మాత్రమే సరిపోతుందన్నారు. 'తల్లికి వందనం' పథకానికి రూ.13,113 కోట్లు అవసరమైతే, కేవలం రూ.9,407 కోట్లే కేటాయించారన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏటా రూ.2,800 కోట్లు అవసరమైతే, కేవలం రూ.1,960 కోట్లే కేటాయించారన్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ బకాయిల ఊసే లేదని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సతీష్, జానకి, రాకేష్, లక్ష్మణ్, శివ, మణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బీచ్‌రోడ్డు: బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. చినవాల్తేరుకు చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఆమెను రిషి అనే యువకుడు వేధిస్తున్నట్లు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం

అల్లిపురం: వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన, పోరాటాలకు అందరూ సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 11న మహాధర్నా నిర్వహించిన తర్వాత కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే రహమాన్, కార్యదర్శి పడాల గోవిందు, సీహెచ్ కాసుబాబు, ఎస్.నాగభూషణం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా నైపుణ్యం పెంచుకోవాలి



క్రీడాకారులతో ఏయూ వీసీ రాజశేఖర్, ఇతర ఆచార్యులు

విశాఖ విద్య: విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంటర్ కాలిజియట్ కమ్ యూనివర్సిటీ జట్టు ఎంపికలు సోమవారం ఏయూ టెన్నిస్ ప్రాంగణంలో జరిగాయి. ముఖ్య అతిథిగా వీసీ పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను అభినందించారు. ఏయూ తరఫున క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపి వర్సిటీకి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఏయూ ఇంటర్ కాలిజియట్ జట్లు సమతా కళాశాల, ఏయూ ఆర్ట్స్ డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల, ఏవీఎన్ కళాశాల, గాయత్రి కళాశాల తదితర బాల్ బ్యాడ్మింటన్ జట్లతోపాటు మహిళల ఇంటర్ కాలిజియట్ జట్లు పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్, డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి జాగ్రత్తలు అవసరం

ఆరిలోవ: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు కంటిపై జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ అల్లూరి హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువుతున్నప్పుడు ప్రతి విద్యార్థి 20–20–20 నిబంధన పాటించాలన్నారు. ఎక్కువ గంటలు చదువుతున్నప్పుడు ఆందోళన, ఒత్తిడి కలుగుతుందని, దీని వల్ల విద్యార్థుల కంటిపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. పరీక్ష కోసం చదువుతున్న విద్యార్థులకు తల్లిదండ్రులు ముందుగానే కంటి వైద్య పరీక్షలు చేయించడం మంచిదని సూచించారు. దీనివల్ల కంటి సమస్యలు ఉంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి వీలుపడుతుందన్నారు. సుదీర్ఘంగా చదివినప్పుడు కంటిపై ఒత్తిడి తగ్గించుకోవడానికి ప్రతి 20 నిముషాలకు 20 అడుగుల దూరంలో ఉన్న దాన్ని 20 సెకెన్ల పాటు చూడాలన్నారు. దీంతోపాటు ఎక్కువసేపు చదవడం వల్ల కళ్లు పొడిబారి దురదలు వస్తాయని, దాని నుంచి నివారణకు తరచూ కనురెప్పలు ఆర్పుతుండాలని సూచించారు. ఏసీ, కూలర్, ఫ్యాన్‌లకు ఎదురుగా కూర్చొని చదవడం వల్ల కళ్లు పొడిబారుతాయన్నారు. చదివే సమయంలో విద్యార్థులు డిజిటల్ సాధనాలు ఉపయోగించడం తగ్గించాలని డాక్టర్ హిమబిందు సూచించారు.

ముస్లింలకు ఎమ్మెల్సీ అవకాశమివ్వాలని ర్యాలీ



ఆరిలోవలో పోస్టర్‌తో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ఆరిలోవ: ముస్లిం మైనారిటీలకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని ఆరిలోవ ముస్లింలు డిమాండ్ చేశారు. ఆరిలోవ ముస్తఫా కాలనీలో ముస్తఫా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మసీద్ వద్ద ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ యాసిన్ బాబా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 6 లక్షల మంది ముస్లింలు ఉన్నారన్నారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం ముస్లంలను గుర్తించి ఎమ్మెల్సీ సీటు ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముస్లింలను గుర్తించి విశాఖకు చెందిన ఎండీ నజీర్‌కు ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్తఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాలేషా తదితరు లు పాల్గొన్నారు.

భూ సేకరణ చట్టంపై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.ఎస్.ఆర్.ఎన్.శర్మ

విశాఖ విద్య: ఏయూ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా 'భూ సేకరణ చట్టం-సమస్యలు, సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ న్యూఢిల్లీకి చెందిన మాజీ ప్రొఫెసర్ కె.ఎస్.ఆర్.ఎన్.శర్మ ముఖ్య ప్రసంగం చేస్తూ భూసేకరణ చట్టం అనేది ప్రభుత్వం లేదా ప్రభుత్వ-ఆమోదిత సంస్థలు ప్రజల భూములను సేకరించడానికి ఉపయోగించే చట్టపరమైన ప్రక్రియ న్నారు. ఈ చట్టం ప్రజల భూములను సేకరించడానికి అనుమతిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథి రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నం బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎన్.సాంబశివరావు, ఆచార్య ప్రేమానందం, విద్యార్థులు, స్కాలర్స్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి తదితరులు

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్ ఎదుట శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి ముఖ్య అతిథిగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఎదగాలన్నారు. ఇందుకు అవసరమైన విజ్ఞానం, మానసిక స్థైర్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ దిశగా మహిళల్లో చైతన్యం తేవాలనే లక్ష్యంతో జిల్లాలోని అనేక శాఖలకు చెందిన మహిళలతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. సెక్టార్-9 సంక్షేమ భవన్ నుంచి ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఏఎస్ రాజా కూడలి వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, పలు శాఖల డీడీలు, పీడీలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



కాలినడకన జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తి గత వాహనాలు విడనాడి ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడాలని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.